సాక్షి
చిత్తూరు
ఆదివారం । 10 । డిసెంబర్ । 2023



'ఆశ్రయం'.. ఆనందం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు పథకంపై లబ్ధిదారుల ఆనందం.. - 8లో



స్పీడ్ స్కేటింగ్ రాష్ట్రస్థాయి పోటీలు

తిరుపతి శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శనివారం స్పీడ్ స్కేటింగ్ రాష్ట్రస్థాయి పోటీలు ప్రారంభమయ్యాయి. - 8లో



మాస్టర్ అథ్లెటిక్స్ ప్రారంభం

తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ స్టేడియంలో శనివారం మాస్టర్ అథ్లెటిక్ పోటీలు ప్రారంభమయ్యాయి. - 8లో

న్యూస్‌రీల్

వరసిద్ధుని సేవలో కర్ణాటక హైకోర్టు జడ్జి



జస్టిస్ రాజేంద్రకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని శనివారం కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజేంద్ర కుటుంబసమేతంగా సేవించుకున్నారు. ఆలయం వద్ద ఆయన ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అధికారులు స్వామివారి చిత్రపటం , తీర్థ ప్రసాదాలు అందించారు.

ఎఫ్‌ఎస్‌ఓ సస్పెన్షన్

చిత్తూరు కార్పొరేషన్: మంగళంపేట ఎఫ్ఎస్ఓ కుప్పస్వామిని సస్పెండ్ చేస్తూ డీఎఫ్ఓ చైతన్య కుమార్‌రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కల్లూరు మండలం ఎర్రపాపిరెడ్డిగారిపల్లెకు చెందిన మస్తాన్ ఈనెల 5న ఏనుగుదాడిలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5 లక్షల చెక్కును మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం అందజేశారు. ఈ క్రమంలో ఎఫ్ఎస్ఓ విధినిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో మంత్రి స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు ఎఫ్ఎస్ఓపై వేటు వేశారు.

నేడు పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి పర్యటన



ఎంసీ పల్లెలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి

పుంగనూరు: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం పుంగనూరు మండలంలో పర్యటించనున్నట్లు జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలో మంత్రి ప్రారంభించనున్న అభివృద్ధి పనుల ఏర్పాట్లు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి ఉదయం 9 గంటలకు కపాడంమిట్టపల్లెలో హెల్త్ సెంటర్‌ను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అనంతరం ఆరడిగుంట, ఎంసీ పల్లె, చంద్రమాకులపల్లెలో 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్లు, వనమలదిన్నెలో సచివాలయం, ఆర్‌బీకే, రాగానిపల్లెలో సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ సెంటర్, ఏటవాకిలి, మంగళం, ఉలవలదిన్నెలో ఆర్‌వో ప్లాంట్లను ప్రారంభిస్తారని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, సీఏ కృష్ణారెడ్డి, ఎంపీడీఓ నారాయణ, ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు జయరామిరెడ్డి, రామకృష్ణారెడ్డి, సత్యనారాయణ, వెంకటరెడ్డి, రమణ పాల్గొన్నారు.

పక్కాగా ల్యాబ్ పరీక్షలు



సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ ఉషశ్రీ

చిత్తూరు రూరల్: జిల్లా ఆస్పత్రిలో ల్యాబ్ పరీక్షలు పక్కాగా నిర్వహించాలని సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ ఉషశ్రీ ఆదేశించారు. శనివారం జిల్లా ఆస్పత్రిలోని ప్రసూతి విభాగంలో ల్యాబ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్నమే ల్యాబ్ మూసేస్తున్నారని, రిపోర్ట్‌లు తప్పులు తడకగా ఇస్తున్నారని, ప్రశ్నిస్తే దురుసుగా మాట్లాడుతున్నారని అందిన ఫిర్యాదుల మేరకు తనిఖీ చేపట్టినట్లు ఆమె వెల్లడించారు. గర్భిణులకు సకాలంలో ల్యాబ్ పరీక్షలు చేయాలన్నారు. పక్కాగా రిపోర్ట్ ఇవ్వాలని స్పష్టం చేశారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పరిశ్రమ ఫలించె!

"ఆదర్శవంతంగా పుంగనూరు నియోజకవర్గాన్ని తీర్చిదిద్దాలి.. పరిశ్రమల స్థాపనతో అభివృద్ధిని పరుగులు తీయించాలి.. యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలి.. కరువు ప్రాంతంలో ఉపాధి వనరులు సృష్టించాలి.. ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపరచాలి.. ప్రతి ఒక్కరికీ బతుకుతెరువు చూపించాలి''.. ఇదే లక్ష్యంతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి ప్రణాళికల మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో పారిశ్రామిక కారిడార్‌కు శ్రీకారం చుట్టారు. రూ.వందల కోట్ల పెట్టుబడితో పలు కంపెనీలను నెలకొల్పేందుకు పకడ్బందీ కార్యాచరణ అమలు చేస్తున్నారు.

- పుంగనూరులో పారిశ్రామికాభివృద్ధి పరుగులు
- రూ.200 కోట్లతో శ్రీకాళహస్తి ఎలక్ట్రోస్టీల్‌కాస్టిక్ పైపుల ఫ్యాక్టరీ
- వెయ్యిమందికి ఉపాధి కల్పించడమే లక్ష్యంగా అడుగులు
- రూ.4,640 కోట్లతో జర్మన్ పెప్పర్ ఎలక్ట్రికల్ బస్సుల కంపెనీ
- 10వేల మందికి ఉద్యోగావకాశాలు



ఫ్యాక్టరీ భూమి పూజలో మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీలు మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు (ఫైల్)



ఫ్యాక్టరీ ప్రహరీగోడ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి తదితరులు

పుంగనూరు : మండలంలోని ఆరడిగుంటలో శ్రీకాళహస్తి ఎలక్ట్రోస్టీల్‌కాస్టిక్ పైపుల ఫ్యాక్టరీ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పుంగనూరు నియోజకవర్గంలో పారిశ్రామికాభివృద్ధే లక్ష్యంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో సుమారు 2వేల ఎకరాల్లో పారిశ్రామిక కారిడార్‌కు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా రెండు రిజర్వాయర్లు నిర్మించి పరిశ్రమలకు అవసరమైన నీరు సమకూర్చడంలో సఫలీకృతులైయ్యారు. ఈ క్రమంలో పైపుల ఫ్యాక్టరీని సుమారు 108 ఎకరాల్లో నిర్మించేలా ప్రత్యేక చొరవ తీసుకున్నారు. అలాగే సుమారు 800 ఎకరాల్లో రూ.4,640 కోట్లతో జర్మన్ పెప్పర్ ఎలక్ట్రికల్ బస్సుల తయారీ కంపెనీని సైతం ఏర్పాటు చేయిస్తున్నారు. ఈ పరిశ్రమ ద్వారా దాదాపు 10వేల మందికి ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించనున్నారు.

మరింత వేగవంతం

ఈ ఏడాది మార్చి 24వ తేదీన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి , ఫ్యాక్టరీ ఎండీ ఉమాసింగ్ కేజ్రీవాల్‌తో కలసి నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఇక అప్పటి నుంచి పనులు వేగం పుంజుకున్నాయి. ముందుగా భూమిని చదును చేసి , 12 అడుగుల ఎత్తు గల ప్రహరీని ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్మిస్తోంది. మంత్రి పెద్దిరెడ్డి ఆదేశాల మేరకు అధికారులు ఫ్యాక్టరీకి అవసరమైన 133 కెవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు చేపట్టారు. ఈ క్రమంలో నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి త్వరలోనే ఫ్యాక్టరీని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సుమారు రూ.200 కోట్లతో నిర్మించే పైపుల ఫ్యాక్టరీ ద్వారా సుమారు వెయ్యిమంది యువతకు ఉద్యోగావకాశం లభించనుంది.

పెరుగుతున్న భూముల ధరలు

మండలంలోని ఆరడిగుంట, మేలుందొడ్డి, వనమలదిన్నె ప్రాంతాలతో పాటు పలమనేరు నియోజకవర్గ సరిహద్దు ప్రాంతాల్లో భూముల ధరలు ఆకాశానంటుతున్నాయి. ఈ ప్రాంతంలో శ్రీకాళహస్తి పైపుల ఫ్యాక్టరీతో పాటు జర్మన్ పెప్పర్ కంపెనీ ఎలక్ట్రికల్ బస్సుల పరిశ్రమ నెలకొల్పుతున్న క్రమంలో భూముల రేట్లకు రెక్కలు వచ్చాయి. మన రాష్ట్రంతోపాటు తమిళనాడు, కర్ణాటకకు చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఈ ప్రాంతంలో భూముల కొనుగోలుకు ముందుకు వస్తున్నారు.



ఫ్యాక్టరీ స్థలం వద్ద కంపెనీ వారు ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక కార్యాలయం

స్థానికులకు ఉపాధి



పడమటి నియోజకవర్గాలలో పరిశ్రమలు లేక వేలాది మంది నిరుద్యోగులు బయట రాష్ట్రాలకు వెళుతున్నారు. ఈ క్రమంలో స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు ఫ్యాక్టరీలు నెలకొల్పేందుకు చర్యలు చేపడుతున్నాం. దేశ స్థాయిలో పుంగనూరుకు పేరు ప్రతిష్టలు తీసుకురావడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సహకారం మరువలేనిది. ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు.

- పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మంత్రి

మరిన్ని పరిశ్రమలు



పుంగనూరు నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశాం . నిరుద్యోగులకు ఉపాధి కల్పించేలా మరిన్ని పరిశ్రమలు ఏర్పాటు చేస్తాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో, ప్రజల సహకారంతో పుంగనూరును పారిశ్రామిక కారిడార్‌గా తీర్చిదిద్దుతాం. అంతర్జాతీయ స్థాయిలో మన ఖ్యాతి ఇనుమడింపజేస్తాం.

- పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎంపీ, రాజంపేట

లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం

చిత్తూరు అర్బన్: జాతీయ లోక్‌అదాలత్ ద్వారా సత్వర న్యాయం పొందవచ్చునని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావ్ తెలిపారు. శనివారం నగరంలోని జిల్లా కోర్టులో న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఐ. కరుణ కుమార్, మూడవ అదనపు జిల్లా జడ్జి శ్రీమతి శ్రీదేవి, బార్ అధ్యక్షులు రాజేంద్రరెడ్డితో కలసి జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడంతో కక్షిదారుల కోర్టుల చుట్టూ తిరిగే అవసరం ఉండదన్నారు. సమయం, డబ్బు ఆదా అవుతుందని వెల్లడించారు. చెక్‌బౌన్స్, మనీ రికవరీ సూట్లు, బ్యాంకు రుణాలు, బీమా, చిట్ ఫండ్, కుటుంబ తగాదాలు, కార్మిక వివాదాలు, ఇతర సివిల్ , క్రిమినల్, కాంపౌండబుల్ ప్రీ-లిటిగేషన్ కేసులను రాజీ చేసుకోవచ్చని వివరించారు. న్యాయమూర్తి కరుణ కుమార్ మాట్లాడుతూ కేసులకు సంబంధించి కోర్టుకు ప్రత్యక్షంగా రాలేని వారికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యే వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. అదాలత్‌లో జిల్లావ్యాప్తంగా మొత్తం 1,958 కేసులు పరిష్కరించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ సుధాకర్, డీఎస్పీ శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావ్



వరదయ్యపాలెంలోని ఇందిరానగర్ ప్రభుత్వ కార్యాలయాల వద్ద జోరుగా విద్యుత్ పునరుద్ధరణ పనులు

ధైర్యం చెబుతూ..

భరోసానిస్తూ!

జిల్లాలో తుపాను సహాయక చర్యలను అధికారులు ముమ్మరం చేశారు. ఎక్కడికక్కడ బృందాలుగా ఏర్పడి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నారు. చెరువులకు పడ్డ గండ్లు, దెబ్బతిన్న రోడ్లను యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేస్తున్నారు. దెబ్బతిన్న ఇళ్లు, నీటమునిగిన పంటల జాబితాను సిద్ధం చేస్తున్నారు. రైతులకు ఎప్పటికప్పుడు సలహాలందిస్తూ ఉన్న పంటను కాపాడడానికి తీవ్రంగా శ్రమిస్తున్నారు. వాలిపోయిన కరెంట్ స్తంభాలు, దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేస్తున్నారు. బాధితుల వెన్నుతట్టి తామున్నామంటూ నేతలు, అధికారులు భరోసానిస్తున్నారు.

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరం

- గండ్లు పూడ్చివేత చర్యలు వేగవంతం
- శరవేగంగా రోడ్లకు మరమ్మతులు
- అవిశ్రాంతంగా శ్రమిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు
- పంట నష్టనివారణలో జిల్లా యంత్రాంగం

తిరుపతి అర్బన్ : తుపాను గాయంతో కుమిలిపోవద్దు. పంట పోయిందని దిగులుపడొద్దు. గూడు చెదిరిందని అధైర్యపడొద్దు. మౌలికవసతులు లేవని కలవరపడొద్దు. పరిస్థితిని యథాతథ స్థితికి తీసుకొచ్చేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నాం. పరిహారాన్ని అందించడానికి నివేదికలు సిద్ధం చేస్తున్నాం. రోడ్లకు మరమ్మతులు చేస్తున్నాం. చెరువులకు పడ్డ గండ్లను పూడ్చివేస్తున్నాం. ఎవరూ ఆందోళన చెందొద్దు.. అండగా ఉంటాం..' అంటూ నేతలు అధికారులు తుపాను బాధితులకు భరోసానిస్తున్నారు.

కష్టం..నష్టం

మిచాంగ్ తుపాన్‌తో తిరుపతి జిల్లాకు తీవ్ర నష్టం వాటిల్లింది. సరాసరి 431.5 మి.మీ వర్షపాతం నమోదైంది. తుపాన్ కారణంగా రూ.750 కోట్ల మేర నష్టం చేకూరింది.

శ్రమిస్తూ.. విద్యుత్‌ను పునరుద్ధరించి

వరదయ్యపాళెం: అధికారులు 100 శాతం గ్రామాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్టు ఏడీఈ చంద్రానాయక్ తెలిపారు. నాగలాపురం సబ్‌డివిజన్ పరిధిలో దాదాపు 250 కరెంట్ స్తంభాలు నేలకొరిగాయన్నారు. అవిశ్రాంతంగా శ్రమించి పల్లెకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామన్నారు.




మనులాలాపేటలో చేనేత మగ్గాలను పరిశీలిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి





వర్షపు నీరు మోటర్ల ద్వారా బయటకు పంపుతూ..., తిప్పిరెడ్డిపల్లె: బొప్పాయి పంటను పరిశీలిస్తున్న సిబ్బంది





క్లుప్తంగా

నీటి తొట్టిలో పడి వ్యక్తి మృతి

పుత్తూరు: పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్ సమీపంలో ఉన్న నీటి తొట్టిలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సీఐ లక్ష్మీనారాయణ కథనం మేరకు... మృతుడు స్థానిక కొత్త తిమ్మాపురం గ్రామానికి చెందిన హరి(32)గా గుర్తించారు. అమర్‌రాజా ఫ్యాక్టరీలో పనిచేసే హరికి పదేళ్ల క్రితం తమిళనాడుకు చెందిన వనితతో వివాహమైంది. ఈనెల 5వ తేదీన భర్తతో గొడవ పడిన వనిత తన ఇద్దరు పిల్లలు నాశిక(3), భవ్యశ్రీ(1)ని తీసుకొని ఇల్లు వదలి వెళ్లిపోయింది. హరి సైతం 6వ తేదీ నుంచి డ్యూటీకి, ఇంటికి వెళ్లలేదు. చివరకు మృతదేహంగా కనిపించాడు. మూడు రోజుల క్రితమే నీటి తొట్టిలో పడి మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి..


అజార్ అలీ (ఫైల్)

గంగాధర నెల్లూరు: మండలంలోని తూగుండ్రంలో విద్యుదాఘాతంతో శనివారం ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. ఆవలకొండ గ్రామానికి చెందిన నసీర్ అలీ కుమారుడు అజార్ అలీ (28) చేపలు పట్టేందుకు తూగుండ్రం చెరువు వద్దకు వెళ్లాడు. గాలం విసిరే సమయంలో పైన వెళుతున్న విద్యుత్ తీగలకు కొక్కెం తగులుకోవడంతో కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మరణించాడు.

ఏనుగు దాడిలో అరటి తోట ధ్వంసం


విరిగిన అరటి చెట్లు

రామకుప్పం: మండలంలోని ఎస్.గొల్లపల్లెలో మురుగేష్ అనే రైతుకు చెందిన అరటి తోటను శుక్రవారం రాత్రి ఒంటరి ఏనుగు ధ్వంసం చేసింది. అటవీ అధికారులు స్పందించి ఏనుగును అడవిలోకి దారి మళ్లించాలని స్థానిక రైతులు కోరుతున్నారు. ఈ క్రమంలో దెబ్బతిన్న అరటి తోటను అటవీ సిబ్బంది శనివారం పరిశీలించారు.

ఆశ్రయం..ఆనందం

నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద వేలాదిమందికి ప్రభుత్వం గూడు కల్పిస్తోంది. కులాలు.. మతాలు.. పార్టీలతో ప్రమేయం లేకుండా అర్హతే ప్రామాణికంగా నిరుపేదల సొంతింటి కల నెరవేరుస్తోంది. ఏళ్ల తరబడి అద్దె గృహాల్లో అగచాట్లు పడిన వారు ధైర్యంగా జీవనం సాగించేలా కార్యాచరణ అమలు చేస్తోంది. ఆధునిక వసతులతో తీర్చిదిద్దిన జగనన్న కాలనీల్లో ఆశ్రయం అందిస్తోంది. ప్రతిష్టాత్మక పథకం లబ్ధిదారుల ఆనందం వారి మాటల్లోనే..

– చిత్తూరు కలెక్టరేట్

జనవాక్కు

కార్వేటినగరం మండలంలో ప్రభుత్వం నిర్మించిన ఇళ్లు



కలలో కూడా ఊహించలేదు



ఇంత చక్కటి ఇల్లు కట్టుకుంటామని కలలో కూడా ఊహించలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో ఇంటి స్థలం కోసం ఏళ్ల తరబడి ప్రదక్షిణలు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో స్థలంతోపాటు పక్కా ఇల్లు కూడా మంజూరు చేశారు. నిర్మాణానికి ఆర్థిక సాయం అందిచారు. మా కాలనీలో సకల వసతులు కల్పిస్తున్నారు. – సుబ్బమ్మ, పాదిరి కుప్పం, కార్వేటినగరం మండలం

రుణపడి ఉంటాం



ఎన్నో ఏళ్లుగా పలమనేరు పట్టణంలో అద్దె ఇంట్లోనే ఉన్నాం. గతంలో ఇంటి కోసం చాలా సార్లు కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకున్నాం. ఎవరూ పట్టించుకోనేలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాకు ఇల్లు మంజూరైంది. పలమనేరుకు సమీపంలోని గడ్డూరు లేఅవుట్‌లో స్థలం కేటాయించారు. మామూలుగా ఈ లేఅవుట్‌లో స్థలం కొనాలంటే లక్షల్లో ఖర్చవుతుంది. అంత విలువైన స్థలం మాకు ఉచితంగానే వచ్చింది. ప్రభుత్వ సాయంతో ఇల్లు నిర్మించుకున్నాం. జగనన్నకు రుణపడి ఉంటాం.

– జీఎస్ శిల్ప, పలమనేరు.

సంతోషంగా ఉంది



నేను టైలర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. నాకు ఇద్దరు పిల్లలు. కొద్దిపాటి సంపాదనలో ఎక్కువ భాగం అద్దెకే సరిపోయేది. సొంతిల్లు అనేది కలలో కూడా గుర్తుచేసుకోలేని దుస్థితి. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మా ఊరికి దగ్గరలోని కత్రిపల్లె వద్ద ఇంటి స్థలం కేటాయించారు. ఆర్థిక సాయం అందించడంతో ఇల్లు నిర్మించుకున్నా. సొంత గృహంలో నివసిస్తుంటే చాలా సంతోషంగా ఉంది.

– గాయత్రి, వి.కోట

జగనన్నకు కృతజ్ఞతలు



చిన్న ఇంటిలో నేను నా భర్త, నా మరిది ఆయన భార్య, అత్త మామ, పిల్లలు అందరం ఒకే ఇంటిలో ఉన్నాం. నా భర్త సుందరరాజులు కూలి పని చేసేవాడు. మా ఆర్థిక పరిస్థితికి సొంత ఇల్లు కట్టుకోవడం అనేది తలకు మించిన భారమే. ఈ దశలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 1.5 సెంట్ల స్థలం అందించింది. రూ.1.80 లక్షల ఆర్థిక సహకారం అందజేసింది. దీంతో మేము చక్కటి ఇల్లు నిర్మించుకున్నాం. ప్రస్తుతం అందులోనే నివసిస్తున్నాం. మా కల నెరవేర్చిన జగనన్నకు కృతజ్ఞతలు.

– నీలా, కృష్ణాపురం, నగరి మండలం

18 నుంచి మహతిలో జాతీయ నాటక పోటీలు


సమావేశంలో మాట్లాడుతున్న కోనేటి సుబ్బరాజు

తిరుపతి కల్చరల్: స్థానిక మహతి కళాక్షేత్రంలో ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు ఎస్ఆర్ నాట్య కళా పరిషత్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి నాటక, శాస్త్రీయనృత్య, భగవద్గీత పోటీలు నిర్వహించనున్నట్లు పరిషత్ అధ్యక్షుడు కోనేటి సుబ్బరాజు తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్ఆర్ నాట్య కళాపరిషత్ 60వ వార్షికోత్సవంలో భాగంగా కళోత్సవాల పేరుతో ఐదు రోజుల పాటు ఈ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు 38 సాంఘిక నాటికలు, 27 పద్యనాటకాలు ఎంట్రీలు వచ్చాయని, పరిశీలన అనంతరం 8 సాంఘిక నాటికలు, 5 పద్య నాటకాలను తుది పోటీలకు ఎంపిక చేసినట్లు చెప్పారు. పరిషత్ 60వ వార్షికోత్సవం సందర్భంగా 64 కళలను దృష్టిలో ఉంచుకొని ఆయా రంగాల్లో సేవలందిస్తున్న 64 మంది నటీనటులకు, హార్మోనిస్టులు, మేకప్‌మెన్‌లను సత్కరించనున్నట్లు పేర్కొన్నారు. జాతీయ నాటక పోటీల్లో ప్రతి రోజు సాయంత్రం 5 గంటల నుంచి ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. చివరి రోజు 22న పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటుందని తెలిపారు. ఐదు రోజుల పాటు నిర్వహించే జాతీయ స్థాయి నాటక, నృత్య, భగవద్గీత పోటీలకు కళాభిమానులు, కళాకారులు, ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఎస్ఆర్ నాట్య కళాపరిషత్ సహాయ కార్యదర్శులు కె.కేశవులురెడ్డి, చంద్రబాబు, ఉపాధ్యక్షులు గోపాలరావు, ఎస్.వెంకటస్వామి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పోటీలలో ప్రదర్శనలు ఇవే

జాతీయ పోటీలలో 18న సాయంత్రం ఆమని... నీ గమనమెక్కడ సాంఘిక నాటిక, మాయాబజార్ పౌరాణిక నాటకం, 19న దానానికి దారులెన్నో, శ్రీకృష్ణ లీలలు పౌరాణిక నాటిక, 20న థింక్, విముక్తి సాంఘిక నాటికలు, ఘంటసాల పౌరాణిక నాటకాలు ప్రదర్శించనున్నారు. 21న అసరసాల, కాపలా సాంఘిక నాటికలు, బాలనాగమ్మ పౌరాణిక నాటకం, 22న మాజీ యువకులు, పక్కింటి మొగుడు సాంఘిక నాటికలు, భక్త ప్రహ్లాద పౌరాణిక నాటక ప్రదర్శనలు ఉంటాయి.

ఘనంగా స్పీడ్ స్కేటింగ్ రాష్ట్ర స్థాయి పోటీలు


స్కేటింగ్ చేస్తున్న క్రీడాకారులు

తిరుపతి ఎడ్యుకేషన్: స్థానిక శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జిల్లా స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన రెండు రోజుల ఆంధ్ర స్పీడ్ స్కేటింగ్ రాష్ట్ర స్థాయి పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా తిరుపతి జిల్లా చీఫ్‌కోచ్ సయ్యద్ సాహెబ్, స్పీడ్ స్కేటింగ్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి మురుగానందం, టెక్నికల్ కమిటీ సభ్యుడు ఎం.గౌతం పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో పాల్గొన్న వివిధ జిల్లాలకు చెందిన స్కేటింగ్ క్రీడాకారులు, అలాగే వివిధ ఆశ్రమాలకు చెందిన విద్యార్థులు సుమారు 190 మందికి వివిధ వయో విభాగాల వారీగా పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు ఆదివారం బహుమతులు అందజేయనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి జీ.ప్రతాప్, సంయుక్త కార్యదర్శి సంతోష్ పూసర్ల తెలిపారు.

నేడు లక్ష్మీ నరసింహస్వామికి ప్రత్యేక అభిషేకం

తిరుమల: తిరుమల మొదటి ఘాట్ రోడ్డులోని నడక మార్గం చెంత వెలసి ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించనున్నారు. కార్తీక మాసంలో స్వాతి తిరునక్షత్రం సందర్భంగా ఏటా ఇక్కడ ప్రత్యేక అభిషేకం నిర్వహించడం ఆనవాయితీ. మూలమూర్తికి ఉదయం పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపుతో విశేషంగా అభిషేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు.

బేడి ఆంజనేయస్వామి ఆలయంలో..

తిరుమల శ్రీవారి ఆలయం ఎదురుగా వెలసి ఉన్న శ్రీ బేడి ఆంజనేయస్వామివారికి ఆదివారం ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించనున్నారు. కార్తీక మాసం చివరి ఆదివారం సందర్భంగా ఏటా ఆలయంలో ప్రత్యేక అభిషేకం నిర్వహించడం ఆనవాయితీ. మూలమూర్తికి ఉదయం పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపుతో అభిషేకం నిర్వహించి, విశేషంగా అలంకరించి పూజలు చేపట్టనున్నారు.

టిప్పర్ ఢీకొని మత్స్యకారుడి మృతి


ఆందోళన చేస్తున్న మత్స్యకారులతో మాట్లాడుతున్న ఎస్ఐ అంజిరెడ్డి

చిల్లకూరు: తీర ప్రాంతంలోని క్రిష్ణపట్నం పోర్టు సౌత్ గేటుకు సమీపంలో బైక్‌లో వెళుతున్న మత్స్యకారుడ్ని పోర్టుకు వెళుతున్న టిప్పర్ వెనుక నుంచి ఢీకొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందగా.. అతని కుమారుడికి తీవ్ర గాయాలు అయిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని లింగవరానికి చెందిన అక్కగారి కరిముల్లా(50), అతని కుమారుడు బాబు బైక్‌లో క్రిష్ణపట్నం పోర్టుకు వెళుతున్నారు. ఈ క్రమంలో సౌత్ గేట్ వద్ద ఉన్న బ్రిడ్జి సమీపంలోకి చేరుకోగానే పోర్టుకు వెళుతున్న టిప్పర్ వెనుక నుంచి వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొంది. దీంతో కరిముల్లా అక్కడికక్కడే మృతి చెందగా.. కుమారుడు బాబుకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న గుమ్మళ్లదిబ్బ, లింగవరం గ్రామాలకు చెందిన మత్స్యకారులు అక్కడకు చేరుకుని ఆందోళన చేపట్టారు. పోర్టు ప్రతినిధులు అక్కడికి చేరుకుని వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఆపై ఎస్ఐ అంజిరెడ్డి మత్స్యకారులతో మాట్లాడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు అట్టహాసంగా ప్రారంభం


జ్యోతిప్రజ్వలన చేస్తున్న నిర్వాహకులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ స్టేడియంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి 42వ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా అటవీ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ నైనారు శ్రీనివాసులు, మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.సుమతి, సైకం రామ్ ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు. జాతీయ జెండాకు గౌరవ వందనం చేశారు. క్రీడాకారుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. జ్యోతి ప్రజ్వలన చేసి రాష్ట్ర స్థాయి పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలకు వివిధ జిల్లాల నుంచి సుమారు 500 మందికి పైగా మాస్టర్స్ అథ్లెటిక్స్ క్రీడాకారులు హాజరయ్యారు. మహిళలు, పురుషులకు విడివిడిగా హైజంప్, లాంగ్ జంప్, జావెలింగ్ త్రో, పరుగు, నడక పందెం వంటి వివిధ విభాగాల్లో పోటీలను నిర్వహించారు. మాస్టర్స్ అథ్లెటిక్స్ క్రీడాకారులు ఉల్లాసంగా, ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా స్ఫూర్తి, ప్రతిభను కనబరిచారు. ఆదివారం ఫైనల్స్ పోటీలు నిర్వహించి విజేతలకు పతకాలు, సర్టిఫికెట్లను అందజేయనున్నారు.